క్లుప్తంగా

మొదటిరోజు ఘనంగా హనుమాన్ జయంతి



మహమ్మదాబాద్: మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామంలో హనుమాన్ జయంతి మొదటిరోజు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం సుప్రభాతం, మహాగణపతి గౌరీపూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, సకలదేవతల ఆహ్వానం, రుద్రాభిషేకం, పార్వతీపరమేశ్వరుల కల్యాణం, తీర్థ ప్రసాదాల వితరణ, భజనలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చౌదర్‌పల్లిలో వర్షానికి కూలిన ఇల్లు



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో కురిసిన వర్షానికి వెంకీగారి సుక్కమ్మ ఇల్లు కూలిపోయింది. ఇంటి పైకప్పు కూలిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలే దు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభు త్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని సుక్కమ్మ కోరుతోంది.

పాంపాండ్లతో భూగర్భజలాల వృద్ధి



నవాబుపేట: పాంపాండ్ల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెంపొంది రైతులకు మేలు జరుగుతుందని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని హాజిలాపూర్, మరికల్, కొండాపూర్ గ్రామాల్లో పాంపాండ్ల ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఉపాధి పనులలో ప్రధానంగా ప్రతి గ్రామంలో పాంపాండ్ల ఏర్పాటు జరుగుతుందన్నారు. రైతు లు వీటిని ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొస్తున్నారన్నారు. ఇప్పటికే మండలంలో 49 పాంపాండ్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీఓ జ్యోతి, తదితరులు ఉన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత



మిడ్జిల్: మండలంలో క్షయతో బాధపడుతున్న 80 మందికి మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పౌష్టికాహారం సరఫరా చేశారు. సకాలంలో ఆహారం తీసుకోని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారి శివకాంత్ సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అయ్యూబ్‌ఖాన్, సూపర్‌వైజర్ ప్రసాద్, సంపత్, దేవయ్య, జంగయ్య, పారిజాత, గీత, యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం వెంటనే తరలించాలి



మిడ్జిల్: రైతులకు పండించిన వరిధాన్యం నెలల తరబడి తరలించకపోవడంతో వ్యవసాయ పొలాల దగ్గర మొలకెత్తుతున్నాయని, ధాన్యంను వెంటనే తరలించాలని బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ యూపిరాజును కోరారు. లారీల కొరత, బ్యాగుల కొరత పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ అన్నారు. చాలా రోజుల నుంచి వరి ధాన్యం కుప్పలు అలాగే ఉండడంతో రైతులు ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారని, రైతులను దృష్టిలో పెట్టుకోని ధాన్యంను వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కుప్పలను పరిశీలించిన వారిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు తిరుపతి, వెంకటయ భీమయ్య, అరవింద్, తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం



అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కార్యాలయంలో చర్చిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

- సిద్ధమవుతున్న మున్సిపల్ అధికారులు
- నిబంధనలు అమలు చేయాలని కమిషనర్ ఆదేశాలు
- చర్చలో పాల్గొన్న కమిషనర్, చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో అక్రమ, అనుమతిలేని, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, వార్డు కౌన్సిలర్లు కుమ్మరి రాజు, బుక్క మహేష్, కోట్ల ప్రశాంత్‌రెడ్డి, విజయ్, దేవా, రహీం, శశికిరణ్, చైతన్య చౌహాన్‌ల మధ్య ఆసక్తికర చర్చ నిర్వహించారు. చర్చలో కౌన్సిలర్ల భర్తలైన రాంమోహన్, వెంకటేశ్, కృష్ణారెడ్డిలు సైతం పాల్గొన్నారు. నిబంధనలు పాటించని వాటిపై ఎక్కడి నుంచి మొదలు పెట్టాలనే విషయంలో వార్డు కౌన్సిలర్లు అధికారుల మధ్య సమన్వయం లోపించింది. ప్రధానంగా ఇటీవల పత్రికల్లో వచ్చిన వాటిపై దృష్టి సారించి వాటి ని కూల్చేయాలని కొందరు కౌన్సిలర్లు అభిప్రాయం వ్యక్తం చేయగా, మరికొందరు అనుమతి లేకుంటే వాటికి ఫైన్ విధించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. మొదట ఫిర్యాదులు చేసిన సమయంలో పట్టించుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని కొందరు కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. బునాది నిర్మించినప్పుడే చర్యలు చేపట్టి ఉంటే ఇప్పుడు భవనాలు నిర్మాణమయ్యేవి కావని పేర్కొన్నారు. సెల్లార్లకు అనుమతి లేకున్నప్పటికీ యథేచ్ఛగా జరిగాయని, జరుగుతున్నాయని కొందరు తెలిపారు. గతంలో అధికారులు సరైన చర్యలు తీసుకుని ఉంటే ఇలా చర్చ చేసే అవకాశం ఉండేది కాదని కొందరు అభిప్రాయపడ్డారు. అధికారులదే తప్పిదమన్నట్లుగా కౌన్సిలర్లు మాట్లాడారు. డబ్బు లు భారీగా చేతులు మారుతున్నాయని ప్రజల్లో చర్చ జరుగుతుండగా, తాను ఒక్క రూపాయి ఎవరితోనూ వసూలు చేయలేదని కమిషనర్ వివరించారు. కౌన్సిలర్లు సైతం తాము వసూలు చేయటం లేదని వివరించారు. ఇలా ఎవరికి వారు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చివరకు రెండు నోటీసులు జారీ చేసిన భవనాలను కూల్చివేయాలని నిర్ణయించారు. మున్సిపాలిటీ పరిధి ప్రారంభం శంకరాయపల్లి నుంచి నిమ్మబావిగడ్డ, ఇటు గంగాపురం రోడ్డు, అటు కావేరమ్మపేట వరకు మొత్తం ఎన్ని అక్రమ నిర్మాణాలో ముందుగా తేల్చాలని, తరువాత వాటిపై చర్యలకు ఉపక్రమించాలని కౌన్సిలర్లు తెలిపారు. ముందుగా ఒకటి, రెండు భవనాలపై చర్యలకు ఉపక్రమించాలని అప్పు డు మిగిలిన వారంతా దారికొస్తారని నిర్ణయించారు. చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత జోక్యం చేసు కుని నిబంధనల ప్రకారం ఎలా చేయాలో అలా చేయాలంటూ కమిషనర్‌కు సూచించారు. ప్రధానంగా 4వవార్డు, 11వ వార్డు, 24వ వార్డుల్లోని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు తేల్చారు.

అనుమతి లేనివాటిని తొలగిస్తాం..

మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ, అనుమతిలేని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలను తొలగిస్తామని కమిషనర్ లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. తనపై అనవసర నిందలు వేయటం సబబు కాదని, ఏ అక్రమ నిర్మాణానికి తాను అండగా ఉండేది లేదని తెలిపారు. మున్సిపాలిటీ చట్టం ప్రకారం ఎలా చేయాలో అలా చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు 2 నోటీసులు ఇచ్చిన వారి జాబితా సిద్ధం చేసి ఏం చేయాలో ప్రణాళికలు రూపొందించాలని టీపీఓను ఆదేశించారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



వృత్యంతర శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి

జడ్చర్ల టౌన్: ఐదు రోజుల పాటు ఇస్తున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని జడ్చర్ల, మిడ్జిల్ మండలాల ఎల్‌ఎఫ్‌టీ హెచ్‌ఎంలు, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో జడ్చర్ల మండల ఉపాధ్యాయులకు, బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మిడ్జిల్ మండలాల ఉపాధ్యాయులకు మంగళవారం వృత్యంతర శిక్షణ ప్రారంభించారు. రెండు చోట్ల ఆమె మాట్లాడారు. శిక్షణ సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలన్నారు. శిక్షణలో మొదటిరోజు జనరల్ సబ్జెక్ట్‌పై ఆర్‌పీలు బోధన చేశారు. రెండో రోజు తెలుగు, మూడోరోజు ఇంగ్లిష్, నాలుగో రోజు మ్యాథ్స్, చివరి రోజు సైన్స్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. బోధన పద్దతుల్లో మార్పులు, బడిబాట, పేరెంట్స్ టీచర్ల సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ఆర్‌పీలు వివరించారు. విద్యార్థులకు సులువైన పద్ధతుల్లో బోధన చేయాలని, వారి మదిలో ఎప్పుడు నిలిచిపోయేలా ప్రయత్నించాలన్నారు. 50మంది విద్యార్థుల దాటిన ప్రతి పాఠశాలకు ఐదు కంప్యూటర్లు ఇవ్వనున్నందున విద్యార్థులకు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)పై బోధన సాగించాలని సూచించారు. దాని పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలన్నా రు. శిక్షణకు జడ్చర్ల మండలంలో 160 మంది, మిడ్జిల్ మండలంలో 79 మంది హాజరయ్యారు. జడ్చర్లలో ఆర్‌పీలు లోక్య, కృష్ణగౌడ్, శంకర్‌రావు, బోప్యనాయక్, నరేష్, విజయలక్ష్మి, శివరాములు పాల్గొన్నారు.

ఉద్యమ నాయకులకు దళితరత్న అవార్డు



మహబూబ్‌నగర్ రూరల్: ప్రతి సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం వివిధ జిల్లాల నుంచి సామాజిక సేవతో పాటు దళితులపై జరుగుతున్న ఆరాచకాలను ఎదిరించి వాళ్లకు అండగా నిలిచి పోరాటం చేస్తున్న ఉద్యమ నాయకులను అవార్డులకు ఎంపిక చేసి ప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా దళితరత్న, సేవరత్న అవార్డులకు టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు వెంకటస్వామి, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు చేతుల మీదుగా దళితరత్న అవార్డులను అందుకున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అడ్డాకులలో ఆందోళన చేస్తున్న కార్మికులు

అడ్డాకుల: కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని టీయూసీఐ నాయకుడు కుర్మయ్య తెలిపారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మంగళవారం అడ్డాకులలో కార్మికులు ఆందోళన చేపట్టారు. బస్టాండ్ ఆవరణలో జరిగిన నిరసన సభలో కుర్మయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు ఇచ్చే రూ.9500 సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెల వేతనాలు ఇవ్వకుండా జాప్యం చేయడం వల్ల తమ కుటుంబాలు అప్పులు పాలవుతున్నాయన్నారు. కార్మికులకు నెలకు రూ.26వేల వేతనం చెల్లిస్తూ బీమా, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయిలు, చంద్రయ్య, బాలమశన్న, రాములు, శాంసన్, వెంకటన్న, కొండన్న, తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జడ్చర్ల–కల్వకుర్తి రహదారిపై నిరసన

మిడ్జిల్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని, కార్మిక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని మంగళవారం మండల కేంద్రంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. కార్మికులకు, రైతులకు, రైతు కూలీలకు అన్యాయం జరిగే చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జగన్, బాలస్వామి, జంగయ్య, నారస్‌రెడ్డి, నర్సింహ, ఈశ్వరయ్య, లాలమ్మ, వెంకటమ్మ, బాలమణి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు రెడ్డిసేవా సమితి ఆర్థికసాయం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాలోని మూసాపేట మండలం నందిపేట గ్రామవాసి నందకిషోర్‌రెడ్డి హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం దాదాపు రూ.15లక్షలు ఖర్చు అవుతుందని, ఆర్థిక సాయం కోసం పాలమూరు రెడ్డిసేవా సమితిని ఆశ్రయించారు. దీంతో వెంటనే స్పందించిన పాలమూరు రెడ్డిసేవా సమితి ద్వారా సేకరించిన డబ్బులు, సొంత నిధుల నుంచి ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.లక్షా 50వేల చెక్కును మంగళవారం సమితి కార్యాలయంలో నందకిషోర్‌రెడ్డి మేనమామకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిసేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తూము ఇంద్రసేనారెడ్డి, వేపూరు రాజేందర్‌రెడ్డి, కోశాధికారి మల్లు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి ఎస్.సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్‌రెడ్డి, వంశీకృష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



వస్పుల గ్రామంలో పోలీసు సురక్ష కళాజాత ప్రదర్శనలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

మిడ్జిల్: జిల్లా పోలీసు సురక్ష ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి మండలంలోని వస్పుల గ్రామంలో బాల్యవివాహాలు, రోడ్డు ప్రమాదాలు, మూఢ నమ్మకాలు, హత్యలు, ఆత్మహత్యలపై కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొత్తవారికి ఎట్టి పరిస్థితులలో ఓటీపీలు చెప్పొద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామానికి చెందిన పసుల నాగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మంగళవారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. నాగమ్మ కుమారుడికి ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో చక్రపాణిరెడ్డి, గంగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజాగౌడ్, రామకృష్ణ, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు బియ్యం, పండ్ల పంపిణీ



రెడ్‌క్రాస్ భవనంలో రక్తదానం చేస్తున్న జూ.ఎన్టీఆర్ అభిమానులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఎను గొండలోని అనాథ ఆశ్రమంలో పిల్లలకు అన్నదా నం కోసం క్వింటాల్ బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. తెలంగాణ చౌరస్తాలోని రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఫెరోజ్, ప్రధాన కార్యదర్శి శ్రీని వాసులు, నాయకులు పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం

నవాబుపేట: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పంట పొలాల్లో మైసమ్మ దేవాలయ నిర్మాణానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి రూ.15 వేలు విరాళం అందించారు. మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన మల్లెపోగు బుచ్చమ్మ(65), అబ్దుల్ ఆలీం (67), బోడుక లక్ష్మమ్మ(65) బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

ఎన్నో ఏళ్ల ఆకాంక్ష.. నేడు సాకారం



లాల్యానాయక్ తండాకు బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: నియోజకవర్గంలోని ప్రతి తండాకు బీటీ రోడ్డు వేయిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని లాల్యానాయక్ తండాలో రూ.2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి చెందాలంటే రవాణా సౌకర్యాలు మెరుగు కావాలన్నారు. ఎన్నో ఏళ్ల ఆకాంక్ష నేడు ప్రజా ప్రభుత్వంలో సాకారం కాబోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, తులసీరాంనాయక్, రాజుగౌడ్, ప్రతాప్‌రెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవుదాం



ఎస్‌ఈ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్ ఉద్యోగులు

జెడ్పీ సెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా అభివృద్ధిలో భాగస్వాములమవుదామని పంచాయతీ రాజ్ ఎస్‌ఈ రాంమోహన్ అన్నారు. మహబూబ్‌నగర్ ఈఈగా విధులు నిర్వహించిన నరేందర్‌రెడ్డి ఎస్‌ఈగా పదోన్నతిపై సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యా రు. ఈ మేరకు మంగళవారం స్థానిక జెడ్పీ హాల్లో పంచాయతీ రాజ్ ఉద్యోగులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలిపారు. ఉద్యోగులు, కాంట్రాక్టర్లు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశానుసరంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలని అవినీతికి తావు లేకుండా పనులు చేయించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఎస్‌ఈగా పదోన్నతిపై బదిలీ అయిన నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ప్రేమ గలవారని, వారి ఆదరణను మరిచిపోలేనన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు విజయ్‌భాస్కర్, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్‌శేఖర్, లక్ష్మన్‌గౌడ్, సురేందర్‌రెడ్డి సీనియర్ అసిస్టెంట్లు రాజు, వెంకటయ్య, రవిగౌడ్ డివిజన్ కార్యాలయం, సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే జైలుకే



కల్లేపల్లిలో సీడ్ షాప్‌లో తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్

రాజాపూర్: గ్రామాల్లో రైతులకు సీడ్ డీలర్స్ నకిలీ విత్తనాలు విక్రయించినట్లు సమాచారం అందితే అలాంటి వారిపై పీడీయాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ సీడ్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు కల్లేపల్లి, రంగారెడ్డిగూడ గ్రామాల్లోని సీడ్ షాప్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో డీలర్ నుంచి ఖచ్చితంగా బిల్లు తీసుకోని పంటకాలం వరకు భద్రపరుచుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో నాణ్యమైన వ్యవసాయ శాఖ సర్టిఫైడ్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున ప్రతి డీలర్ సరైన ఎరువుల నిలువలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏఈఓ రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి



నవాబుపేటలో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీధర్‌రెడ్డి

నవాబుపేట: పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని, ఆస్పత్రికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ప్రధానంగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌లు, గ్రామాల్లో పనిచేసే వైద్య సిబ్బంది పర్యటన వివరాల రికార్డులు పరిశీలించి విధుల్లో మరింత స్పష్టత వచ్చేలా మార్పు రావాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది సమయ పాలన పాటించి విధులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో సైతం వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. వ్యాక్సినేషన్ తదితర విషయాల్లో నిర్లక్ష్యం చేయరాదని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, రాఘవేందర్, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అబ్దుల్లా సాహెబ్ దర్గా ఉర్సు



మూసాపేట దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని హజ్రత్ అబ్దుల్లా సాహెబ్ దర్గా వద్ద మంగళవారం రాత్రి ఉర్సు నిర్వహించారు. మొల్ల నిరంజన్ ఇంటి నుంచి గంధాన్ని బయటకు తీశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తీ పాటలకు యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం దర్గా వద్దకు చేరుకున్న తర్వాత గంధంను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాల నాయకులు దర్గాలో ప్రార్థనలకు హాజరయ్యారు. అనంతరం జాహంగీర్‌ఖాన్ ఆధ్వర్యంలో దర్గా వద్ద గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, నిర్వాహకులు నిరంజన్, హలీం, మొల్ల ఖాదర్, రఫీ, మైనార్టీలు ఖాజామైనొద్దీన్, టైలర్ కలీం, మొక్తార్ హఫీజ్, బ్రిక్స్‌పాష, షేక్‌బాలీ, టైలర్ ఆబిద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వారిని ఆపేవారే లేరు!

- పెద్దచెరువులో యథేచ్ఛగా ఒండ్రుమట్టి తరలింపు



దేవరకద్ర చెరువు నుంచి రాత్రి వేళలో కొనసాగుతున్న మట్టి తరలింపు

దేవరకద్ర రూరల్: దేవరకద్ర పెద్ద చెరువు నుంచి ఇటుక బట్టీల కోసం కొందరు వ్యక్తులు జేసీబీలు, ట్రాక్టర్ల సహాయంతో వారం రోజులగా పెద్ద ఎత్తున ఒండ్రుమట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే వార్తలు ప్రచురితమైనా సంబధిత అధికారులు స్పందించలేదు. ఇదే అదునుగా సోమవారం రాత్రి పెద్ద ఎత్తున జేసీబీలు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తుండగా, పట్టణానికి చెందిన ముదిరాజ్ సంఘం యువకులు చెరువులోకి వెళ్లి మట్టి తరలింపును అడ్డుకున్నారు. ఈ విషయంపై కొన్ని రోజులుగా అధికారులకు సమాచారం ఇచ్చిన స్పందించలేదని పేర్కొన్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.